

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 19 పుష్పం :23 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-2-99, వడ్లవాని పాలెం.)**

*ప్రియమైన ఆత్మబంధువుల్లారా!*

మీకు, నాకు, దేవతలకు, ఈ సృష్టికి అంతకు ఆధారంగా ఉన్నది బ్రహ్మం. దానికి రూపం లేదు, నామం లేదు. అది నీకళ్ళకు కనిపించక పోవచ్చు. నీకు కనిపించనంత మాత్రంచేత అదిలేదు అని అనుకోకూడదు. ఎవరి మానసికప్రవృత్తిని బట్టివారు వారికి నచ్చిన రూపంలో భగవంతుని ఆరాధించుకోవచ్చు. కాని పొందేవస్తువు ఒక్కటి మాత్రమే. చెరువులోనికి దిగటానికి అనేక రేవులు ఉండవచ్చు. ఏరేవు ద్వారాదిగినా నీటి కోసమే. అలాగే నీవు కృష్ణుడిని ఆరాధించినా, రాముడిని ఆరాధించినా, దేవిని ఆరాధించినా నీవు పొందవలసింది బ్రహ్మమునే. ఆచార్యులవారు విష్ణువు మీద, శివుడు మీద, దేవతల మీద అనేక స్తోత్రాలు వ్రాసారు. ఒక ప్రక్కన బ్రహ్మం గురించి చెపుతూ ఈ దేవతల మీద అనేక స్తోత్రాలు వ్రాయడం ఏమిటి అని కొంతమంది ఆచార్యులవారిని విమర్శిస్తారు. అలా విమర్శించనక్కరలేదు. ఆయనకు ఏమీ అక్కరలేదు. ఎవరికి ఏది ఇష్టమో అది చదివి తరిస్తారు అని అవి అన్నీ మన కోసమే వ్రాసారు. జ్ఞానికి పనిచేసి పొందవలసింది అంటూ ఏమీ ఉండదు, కాని జీవకోటికి ఆదర్శంగా ఉండటం కోసం పనిచేస్తాడు.

ఆధ్యాత్మికవిద్య చాల కష్టం అని అనుకొంటూ ఉంటారు. కష్టం, కష్టం అని అనుకోవటం కూడా ఒక అలవాటు. మన దైనందిన జీవితంలో జాగ్రత్తగా ఉంటే మనం తినే ఆహారం విషయంలో, మాట్లాడే మాటల విషయంలో జాగ్రత్తగా ఉంటే మనం ఏదైతే పొందాలి అనుకొంటున్నామో దానిని పొందుతాము, కంగారు పడనక్కరలేదు. ఇల్లు విడిచి పెట్టి వెళ్ళాలి, ఉపవాసాలు చేయాలి లేకపోతే ఇది రాదేమో అని అనుకొంటారు. అది ఏమీ అక్కరలేదు. మన జీవితం సరళంగా ఉండాలి, మనం పవిత్రులం అవ్వటానికి ప్రయత్నం చేయాలి. మీరు బాగుపడాలి అని ఇతరులు చెప్పటం వేరు. ఇతరులు చెప్పింది తాత్కాలికంగా ఉంటుంది. మనం బాగుపడాలి, అభివృద్ధి లోనికి రావాలి అనే సంకల్పం మీకు వస్తే ఎవరూ ఆపుచేయలేరు. ఆత్మ గురించి విసుగు వచ్చేలా శ్రవణం చేయాలి, మననం చేయాలి. వాక్కు మీ నియమంలో ఉండాలి. నోరు మూసుకొని కూర్చోవటం కాదు, అవసరమైనప్పుడు మాట్లాడాలి, అవసరం లేనప్పుడు మాట్లాడకూడదు. ఎవడైతే తన శరీరమును, మనస్సును స్వాధీనంలో పెట్టుకొన్నాడో వాడికి తపస్సు సాధ్యమవుతుంది. సమాధిస్థితి అంటే మనం ఉన్నాము అన్న సంగతి మనకు

తెలియాలి. శాంతిగాను, సుఖంగాను, ఆనందంగాను ఉండాలి. మనం సుఖం కోసం బాహ్యమైన వ్యక్తులమీద, వస్తువుల మీద ఆధారపడతాము.సమాధి స్థితి వచ్చినప్పుడు సుఖంకోసం భాహ్యమైన వ్యక్తులు మీద. వస్తువులు మీద ఆధారపడవలసిన పని లేదు, తాను ఉన్నానన్న సంగతి తనకు తెలుస్తూ ఉంటుంది.ప్రతీ మనిషికి సుఖం కావాలి. అది నీ హృదయంలో ఉన్న వస్తువులో ఉంది. అది ఉండటం వలన అది తెలియబడుతూ ఉంటుంది. దాని స్వరూపం సుఖం. ఆ సుఖం మీకు అందుబాటులోనికి వచ్చినప్పుడు సుఖం కోసం బాహ్యమైనవస్తువుల మీద ఆధారపడవలసిన పని లేదు, ఆ వస్తువును ఆ వస్తువే enjoy చేస్తూ ఉంటుంది. మీకు సుఖం, ఆనందం తెలుస్తూ ఉంటుంది. అప్పుడు శరీరం ఉన్నా, లేకపోయినా, లోకం కనిపించినా, కనిపించకపోయినా నీకు ఏమీ భేధం ఉండదు. ఎందుచేతనంటే ఉండటం అనేది మీకు జరుగుతూ ఉంటుంది. భగవంతుని పేరు ఏమిటి అంటే ఉండటం అన్నారు భగవాన్.నీ హృదయంలో ఉండటం అనే ఒక వస్తువు ఉంది. అది ఎప్పుడూ ఉంటుంది. అది నీకు అనుభవంలోకి వచ్చినప్పుడు శరీరం మరణించినప్పటికి నీకు మరణం లేదు అని నీకు తెలుస్తుంది. రమణమహర్షిగారు ఈ స్థితిని స్వయంగా అనుభవించారు.

ఇప్పుడు మనం దేహానికి పరిమితమై ఉన్నాము. లోపల ఉన్న వస్తువు నీకు వ్యక్తమయినప్పుడు అది అంతటా ఉంది కాబట్టి నీవు కూడా అంతటా ఉన్నావు అని నీకు తెలుస్తుంది. దానికి చావు పుట్టుకలు లేవు కాబట్టి నీకు కూడ చావు పుట్టుకలు లేవు అని నీకు తెలుస్తుంది. అది పురాతనమైనది, సనాతనమైనది, కాబట్టి నీవు కూడా పురాతనమైనవాడవు సనాతనమైనవాడవు అని తెలుస్తుంది. మీకు ఎప్పుడైతే ఆత్మజ్ఞానం కలిగిందో దానికి సంబంధించిన శక్తి, జ్ఞానం, ఆనందం అన్నీ మీకు వచ్చేస్తాయి. ఇది కల్పితం కాదు. ఇది అనుభవైకవేద్యము. మీకు అనుభవం లేదు కాబట్టి ఇతరులు చెపుతూ ఉంటే ఇది కల్పిస్తున్నారు అనిపిస్తుంది. ఆ వస్తువు మన మాటలకు, మనస్సుకు, ఇంద్రియాలకు అందకపోవచ్చు.కాని అభ్యాసం చేస్తే నీ అనుభవానికి అందుతుంది. అయితే దానికి మనిషికి వైరాగ్యం ఉండాలి.భగవంతుని సంకల్పాన్ని గౌరవించాలి గాని ఎప్పుడూ బలవంతం పెట్టకూడదు. ఎప్పుడు ఏది ఎలా ఇవ్వాలో ఆయన ఇస్తూ ఉంటాడు. ఈ లోపల ఆయనను బలవంతం పెట్టాము అనుకోండి, ఆయన ఇస్తాడు అనుకోండి మనం పాడైపోతాము. ఒకోసారి కొన్ని విషయాలు ఇవ్వకుండా ఆపుచేస్తాడు అది ఇస్తే మనం పాడయిపోతాము అని ఆయనకు తెలుసు. అది అర్ధం కాక మనం భగవంతుడిని తిడతాము. భగవంతునికి ఇష్టం, అయిష్టం ఏమిటి. జీవుడికి ఇష్టం, అఇష్టం ఉంటాయి. మనకు రాగద్వేషాలు ఉన్నాయి కాబట్టి దేవునికి కూడ ఉన్నాయి అనుకుంటాము. మనకి ఉన్నవి ఆయనకు అంటగడతాము, మన బుద్ధి అంత కురుచబుద్ధి. మన మనస్సు ఎందుకు భాహ్యముఖానికి వెళుతోంది అని అర్ధం

చేసుకుంటే అది అణిగిపోతుంది. బండతనంగా వెళ్ళకూడదు. వివేకం, సూక్ష్మబుద్ధి ఉండాలి. మీ బలహీనతల వలన నేను పాడవ్వను. నా బలహీనతల వల్ల నేను పాడవుతాను. మా ఇంటిలోని నిప్పేకదా అని నిప్పును ముద్దు పెట్టుకుంటే మూతి కాలుతుంది. అలాగే నా బలహీనతలే కదా ఉంటే ఉండనియ్యి అనుకుంటే అవే నీ కొంప ముంచుతాయి . నీలోని బలహీనతలను తొలగించుకొనే ప్రయత్నం చేయాలి.

కోరికను సంతృప్తిపరుస్తూ ఆ కోరిక నుండి బయటపడినవాడు ఈ సృష్టిలో ఎవడూ లేడు. నిప్పు మీద పెట్రోలు పోస్తే అది పెరుగుతుందా? చల్లారుతుందా? అది పెరుగుతుంది. అలాగే నీకు ఏ కోరిక అయితే ఉందో ఆ కోరికను సంతృప్తి పరచే కొలదీ అది పెరిగిపోతూ ఉంటుంది. కోరిక వచ్చిన తరువాత దానితో పోరాడటంకంటే అది ఎక్కడ ఉదయిస్తోందో అక్కడ ఉండిపోతే అది అణిగిపోతుంది అన్నారు భగవాన్. ఆత్మచింతనలో నుండి నీ మనస్సు జారకుండా చూసుకోవాలి దీనికి శాస్త్రం యొక్క సహాయం, గురువు యొక్కసహాయం అవసరం. నీ హృదయంలో ఉన్న సుఖం నీకు అందేవరకు సుఖం కోసం మార్కెట్‌లో తిరుగుతూనే ఉంటావు. మనంఅందరము భక్తులమే కాని ముముక్షత్వం మనకు లేదు. జ్ఞానాన్ని ఇవ్వమని, వివేకాన్ని, వైరాగ్యాన్ని ఇవ్వమని మనం దేవుని ప్రార్థించాలి అంతే గాని కోరికల కోసం కాదు. తండ్రి చనిపోయిన తరువాత వివేకానందుడు అన్న వస్త్రాలకు ,చాలా ఇబ్బంది పడ్డాడు. కొన్ని రోజులు తనకు, తల్లికి సరిపడ అన్నం కూడ ఉండేది కాదు. అప్పుడు వివేకానంద ఈ రోజు నేను స్నేహితుల ఇంటి వద్ద అన్నం తిని వచ్చాను అని చెప్పేవాడట. తాను తింటే అమ్మకు సరిపోదు అని అలా అబద్ధం చెప్పేవాడట పైకి చూస్తే ఆయన చెప్పేది అబద్ధమే. కాని అబద్ధం ఎందుకు చెపుతున్నాడు ఎవరినో పాడుచేయటానికి చెపుతున్నాడా? లేదు. మంచికోసమే చెపుతున్నాడు. అందుచేత దీనివలన పాపం రాదు పైగా పుణ్యం వస్తుంది. ఆ మనిషి ఏ తలంపుతో చెపుతున్నాడో చూడాలి. మీరు ఎంతసేపు దేవుడు, దేవుడు అంటారు, మోక్షం గురించి చెపుతారు. మాకు తినటానికి తిండిలేదు అని రామకృషుడితో స్వామీజీ అనేవారట. అయితే దుర్గను అడుగు, అమ్మను అడుగు అని రామకృష్ణుడు చెప్పేవారట.ఇక్కడ ఆశ్చర్యం. లోపల ఉన్నదే బయటకు వస్తుంది. లోపల లేనిది బయటకు రాదు. దుర్గను చూసి నాకు అన్న వస్త్రములు ప్రసాదించు అని అడగటం మానివేసి నాకు జ్ఞాన వైరాగ్యములు ప్రసాదించు అని స్వామీజీ అడిగేవారట. అప్పుడు రామకృష్ణుడు అన్న వస్త్రములు అడగమని నిన్ను పంపిస్తే ఇలా చేస్తున్నావు ఏమిటి అని అడిగితే దేవి మొఖం చూసేటప్పటికి నాకు జ్ఞానం ఇవ్వమని వస్తుంది గాని అన్నం ఇవ్వమని రావటం లేదు అని చెప్పేవారు. వాడు స్వామీజీ అంటే. మనం మోక్షం కోసం ప్రయత్నం చేస్తూ ఉంటే మన అవసరాలను భగవంతుడే తీరుస్తాడు. ప్రత్యేకంగా మనం అడుగనక్కరలేదు. పని చేసే యోగం ఉంటే అది నీవు చేస్తూ ఉండాలి. పని చేసే యోగం నీకు లేకపోతే పని నీ దగ్గరకు రాదు. భగవంతుడు నీకు

కేటాయించిన పనిని అయిష్టంగా కాకుండా ఇష్టంగా చెయ్యి. అలా చెయ్యటం వలన నీ మనస్సు పల్చబడుతుంది. ఇతరులను మీరు బాధపెట్టటం ఎటువంటిదో మీ మనస్సును బాధపెట్టుకోవటం కూడ అటువంటిదే. ప్రతీ విషయానికి మీ మనస్సును పుండు చేసుకోవద్దు.ఇతరులను హింస పెడితే పాపం అని మీరు అనుకుంటున్నారు. ఇతరులను హింస పెడితే ఎంత పాపమో మీ మనస్సును హింస పెట్టటం కూడ అంతే పాపం ఎందుచేతనంటే మీలో జీవుడు రూపంలో ఉన్నవాడు కూడా భగవంతుడే. పని జాగ్రత్తగా చేయండి. వచ్చేది వస్తుంది రానిది రాదు. కర్త లేని కర్మను చేయండి.మనం ఉద్రేకపడి ఏపని చేసినా, ఏ మాట మాట్లాడినా చివరకు మనకు దుఃఖాన్ని తీసుకుని వస్తుంది తరువాత పశ్చాత్తాపపడవలసి వస్తుంది. నాలుగు సార్లు ఆలోచించి ఒక పని చెయ్యి, నాలుగు సార్లు ఆలోచించి ఒక మాట మాట్లాడు. ఎట్టి పరిస్థితుల్లోను ఉద్రేకానికి గురికాకూడదు.

భగవంతుని సంకల్పం ఎలా ఉంటే అలా జరుగుతుంది. నీ సంకల్పమే నా సంకల్పం, నీ ఇష్టమే నా ఇష్టం అని అనుకుంటే దేహగతమైన నేను పల్చబడుతుంది, నేను అనే బుజ్జిగాడు పోతాడు. అప్పుడు భగవంతుడు ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు అది శరణాగతి. ఈ దేహం యొక్క పుట్టుక గురించి, చావు గురించి ఆలోచించవద్దు అది ప్రారబ్దాన్ని బట్టి వచ్చింది ప్రారబ్దాన్ని బట్టిపోతుంది. నీవు పొందవలసిన దాని గురించి ఆలోచించు. ఈ భూమి మీదకు ఏ పని నిమిత్తం గురించి వచ్చావో అది మర్చిపోవద్దు. మనకు తత్వం తెలిసేంతవరకు మనం నమ్మిన దేవుడు ఒక్కటే నిజం అని అంటాము. ఇటువంటి ప్రమాదంలో పడతాము. మీకు తత్వం అర్దమవుతూ వుంటే ఎంత దుఃఖం ఉన్నా ఆనందంగా మారిపోతుంది.దుఃఖాన్ని పోగొట్టేవాడు ఉన్నప్పుడు మీకు ఎంత దుఃఖం ఉన్నా ఫరవాలేదు . మీరు అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి. అర్థమవుతూ ఉంటే మీ దుఃఖం అంతా ఆనందంగా మారిపోతుంది. బుద్ధిని నిర్మలంగా పెట్టుకోండి. మనం ఎక్కడ ఉన్నా, ఎలా ఉన్నా మనం పవిత్రులు అవ్వటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే జ్ఞానమే వచ్చి మనలను వరిస్తుంది. ఏమీ తొందరపడనక్కరలేదు. పెద్ద పెద్ద త్యాగాలు చేయనక్కరలేదు. నిర్మలంగా ఉండండి, నిశ్చలంగా ఉండండి. మీ చేతిలో ఉన్న పని చేయండి. ఎక్కువ ఆసక్తి పెట్టుకోవద్దు. కొంతమంది మాటలతో దేవుని ఆరాధించి సరిపెట్టుకుంటారు. కొంత పని చేసి దేవుని ఆరాధిస్తారు. మాటతో సరిపెట్టుకొంటే అది వాచా వేదాంతం. పని ద్వారా దేవుని ఆరాధిస్తే అది అనుష్టాన వేదాంతం. మనం వాచా వేదాంతం దగ్గర ఉన్నాము. అనుష్టాన వేదాంతం దగ్గర లేము. పని ద్వారా భగవంతుని ఆరాధించటానికి ప్రయత్నం చేయండి

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL



ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

సంపుటి : 4 సంచిక : 22 పుష్పం :27 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-2-99, జిన్నూరు)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

గురువు దేహంలో ఉండవచ్చు దేహంలో ఉండకపోవచ్చు. దేహంలో ఉన్నా దేహంలో లేకపోయినా గురువుతో మానసిక అనుబంధం ముఖ్యం. గురువు దేహంలో లేనంత మాత్రం చేత అక్కడ పని జరగదు అని అనుకోవద్దు. అక్కడ పని చేసేది దేహం కాదు, పని చేసేది ఆత్మ, చైతన్యం. మన ప్రయత్నం, మన సంకల్పం వృధా కావచ్చు కాని భగవంతుని సంకల్పం వృధా అవ్వటానికి వీలులేదు. అది జరిగే తీరవలె. బద్ధకస్తులు, సోమరులు బ్రతికిఉన్నా చనిపోయిన వారితో సమానం అని ఒక సామెత ఉంది. మనం బద్ధకస్తులమైతే, సోమరితనంగా ఉంటే, వస్తువు యొక్క స్వరూపం తెలియదు. మనం భక్తి శ్రద్ధలు విడిచిపెట్టకుండా, ఈశ్వరుని యందు ప్రేమ విడిచిపెట్టకుండా ధనకాంక్ష ఉన్నవాడు ధనం కోసం, కీర్తి కాంక్ష ఉన్నవాడు కీర్తి కోసం ఎలా ప్రయత్నం చేస్తాడో అలాగ ఆత్మజ్ఞానం కోసం నీవు కూడా ప్రయత్నం చేస్తే వస్తువు నీకు లభ్యమవుతుంది. పూర్వం మీకు భక్తి లేకపోతే, వివేకం లేకపోతే, మంచి ప్రవర్తన లేకపోతే అది మర్చిపోండి. మర్చిపోవటమే మందు. గతాన్ని మర్చిపోండి. అది మర్చిపోయి ఇప్పుడు సత్పురుషులతో సహవాసం చేసి వివేకాన్ని పెంచుకొని, భక్తిని పెంచుకొని, హృదయం యొక్కలోతులలోనికి వెళ్ళి పరమాత్మ యొక్క దర్శనం చేసుకోండి. మానవజన్మ వచ్చింది. దానిని సద్వినియోగం చేసుకోండి. ఈ భూమి మీదకు వచ్చిన పని మర్చిపోవద్దు. శ్రద్ధ ఉంటే జ్ఞానం కలుగుతుంది. అశ్రద్ధ పనికి రాదు. ఆత్మభావన పెరుగుతూ ఉంటే దేహభావన తగ్గుతుంది. ఆత్మభావన పెరుగుతూ ఉంటే కురిడీకొబ్బరి చిప్పతో ఎలా వేరు అయిపోతుందో అలాగ దేహం వేరు, నేను వేరు అని మీరు దేహం నుండి విడిపోతారు. అప్పుడు అరచేతిలో ఉన్న వస్తువు ఎంత స్పష్టంగా నీకు కనబడుతుందో అలాగ నీ లోపల ఉన్న వస్తువుఅంత స్పష్టంగా నీకు తెలుస్తుంది. ఇందులో సందేహించవలసిన పనిలేదు. మీరు ప్రయాణం చేసే మార్గంలో శ్రద్ధగా ప్రయత్నం చేయండి. మీ గురువు ఎవరు అయినా, మీరు ఏ సాంప్రదాయంలో ఉన్నా మీరు చేయవలసిన కృషి మీరు శ్రద్ధగా చేస్తే, ప్రేమగా చేస్తే, మీరు ఏ గురువును ఆరాధిస్తున్నారో ఆ గురువు ద్వారా ఈశ్వరుడు మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. అనుగ్రహించేవాడు ఈశ్వరుడే. నీకు కనబడే రూపం మాత్రమే గురువు అని అనుకోవద్దు. గురువు అంటే ఆత్మ, బ్రహ్మం.

మనస్సును నీవు అదుపులో పెడితే బాగుపడతావు. స్వాధీనమైన మనస్సు నీకు జ్ఞానమును సంపాదించి పెడుతుంది. మనస్సు నీకు స్వాధీనం కాకపోతే నీ మనస్సే నిన్ను పతనం చేస్తుంది

మనస్సు స్వాధీనంలో ఉంటే భగవంతుడు మిమ్మల్ని నరకం లోనికి పంపినా అది మీకు స్వర్గంగా మారుతుంది. మనస్సు స్వాధీనంలో లేకపోతే స్వర్గానికి పంపినా దానిని నరకం చేసేస్తావు. నీవు చేసే పనుల విషయంలో, నీకు వచ్చే ఆలోచనల విషయంలో బాధ్యతగా ఉండు. బాధ్యతా రాహిత్యం పనికి రాదు. అన్నింటి కంటే మౌనఉపదేశము ఉత్తమమైనది. ఉపదేశం చెప్పటం తేలిక, అనుష్టానం కష్టం. చెప్పటం తేలిక ఆచరించటం కష్టం. గురువు దయను సంపాదిస్తే మనకు స్వరూప జ్ఞానం కలుగుతుంది. గోపికలు కృష్ణుడితో అంటారు నీ పాదాలు మృదువుగా ఉన్నాయి. మా హృదయాలు కఠినంగా ఉన్నాయి, రాళ్ళలా ఉన్నాయి, ఇంత కఠినమైన హృదయాలలో మృదువైన నీ పాదాలను నిలబెట్టమని అడగటం ఎంత వరకు న్యాయం. ఇది న్యాయం కాదు. నిన్ను ఆరాధించి. నిన్ను స్మరించి, నిన్ను ధ్యానించి నీ పాదాలు ఎంత సున్నితంగా ఉన్నాయో మా హృదయాలను కూడా అంత మృదువుగా, సున్నితంగా చేసుకుంటే నీ పాదాలను మా హృదయంలో నిలబెట్టమని అడగకుండానే మా హృదయంలో నీ పాదాలను ఉంచుతావు అప్పుడు మా పని పూర్తి అవుతుంది,మాకు మోక్షం కలుగుతుంది అని గోపికలు కృష్ణుడుతో చెప్పేవారు. ఇతరులను చూసేటప్పుడు వారి సుగుణాలను చూడు, నీ వంక నువ్వు చూసుకొన్నప్పుడు నీలో ఉన్న దుర్గుణాలను చూసుకో. ఇతరులలో ఉన్న సుగుణాలను అలవర్చుకో, నీలో ఉన్న దుర్గుణాలను తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. ఇది సాధకుడు యొక్క లక్షణం.

వాసనలు అప్పుడప్పుడు అణిగి ఉంటాయి. వాసనలు జయించాము, ఒడ్డుకు వచ్చేశాము అని అప్పుడే అనుకోవద్దు. శరీరం శ్రమపడి అప్పుడప్పుడు ఎలా నిద్రపోతూ ఉంటుందో అలాగ నీ వాసనలు కూడా లోపల పని చేసి శ్రమపడి నిద్రపోతూ ఉంటాయి. అప్పుడు జ్ఞానం వచ్చిందని నీవు అనుకుంటావు అలా భ్రమపడకు, అది నిజం కాదు. వాసన అణగటం వలన నీకు జ్ఞానం రాదు, శాంతి రాదు, వాసన వేరుతో సహా నశించాలి అప్పుడు గాని నీకు జ్ఞానం కలుగదు. వాసన అణగటం వేరు, వాసన నశించటం వేరు. ఈ రెండింటి మధ్య ఉన్న భేధం చూసుకోండి. గురువు మౌనంగా ఉంటే ఉపదేశించటం లేదు అని అనుకోవద్దు. గురువు యొక్క మౌనం కూడా ఉపదేశమే. గురువు యొక్క మౌనాన్ని తక్కువగా అంచనా వేయవద్దు అది మీ హృదయంలో ప్రవేశించి మీ వాసనలను కెలికి మీకు తెలియజేసి మీ చేత ఎంతో కొంత సాధన చేయించినట్లు నెపం చూపించి వాటిని నశింపజేస్తాడు వాడు గురువు. మీరు చేయగలిగిన సాధన చేయండి నామమాత్రంగా ప్రయత్నం చేయండి, మీ పని పూర్తి చేస్తాడు. రైలుబోగీలు ఎంత కొత్తవి అయినా ఇంజనుతో కనెక్షన్ లేకపోతే అవి కదలవు. అలాగే మీరు ఎంత ఉత్తములైనా మీకు గురువుతో మానసికఅనుబంధం లేకపోతే మీరు ఆత్మసాక్షాత్కారమును పొందలేరు. గురువు యొక్క మౌనం ముందు మనం చేసే సాధనలు అన్నీ అప్రధానమైనవి. అలాగని చేయటం మానవద్దు. గురువు యొక్క మౌనం బంగారం, మనం చేసే సాధనలు ఇత్తడి, రాగి, మట్టి వంటివి. వీటికి కూడా విలువ ఉంది కాని బంగారం తో పోల్చినప్పుడు వీటి విలువ చాలా తక్కువ. అలాగే గురువు యొక్క

మౌనంతో చూసినపుడు మన సాధనలు కూడా అంతే. గురువు యొక్క మౌనం జీవనది లాంటిది. అది ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది. మౌనం విరామం లేని సంబాషణ. మాట మీకు మారుమనస్సును తీసుకొని రాకపోవచ్చును కాని మౌనం మీకు మారుమనస్సును తీసుకొని వస్తుంది. ఈశ్వరునివైపు ఎలా ప్రయాణించాలో సరియైన డైరెక్షన్‌ను నీకు చూపిస్తుంది, నీ జీవిత విధానంలో మార్పు తీసుకొని వస్తుంది. నీవు సాధనలు ఎందుకు చేస్తున్నావు మనస్సును పవిత్రం చేసుకోవటానికి చేస్తున్నావు. గురువు యొక్క మౌనం వీటి అన్నింటికంటే అతి శీఘ్రంగా నీ మనస్సును పవిత్రం చేస్తుంది. మౌనం కూడా మాట్లాడుతుంది మనలో అర్హత లేనపుడు అది మనం అర్థం చేసుకోలేము. మీరు సాధన చేస్తూ ఉండవచ్చు పడిపోతూ ఉండవచ్చు. కాని అంతమాత్రం చేత మీ సాధన వృదా అవ్వదు. మీరు చేసే సాధనలు అన్నీ కూడా పునాది రాళ్ళుగా ఉపయోగపడతాయి. మీరు చేసే మంచి గాని మోక్షానుభవం పొందటానికి మీరు చేసే ప్రయత్నం గాని వృదా పోదు. రాబోయే జన్మలో ఇవి అన్నీ మీకు కలిసి వస్తాయి. మీరు చేసేది అంతా తిరిగి మీకే ఇచ్చేస్తాను అని భగవంతుడు గీతలో చెప్పాడు.

మీరు పని చేసేటప్పుడు ఏదైనా పొరపాటు రావచ్చును. పొరపాటు చేసాము అని అస్తమానూ స్మరించుకోవటం మానివేసి చేసిన పొరపాటు మరల చేయకుండా చూసుకోండి. చేసిన పొరపాట్లే చనిపోయేవరకు చేస్తూ ఉంటే అది తెలివితక్కువ వారి లక్షణం. పొరపాట్లు చేసినా వాటిని సవరించుకొని మరణం వచ్చే లోపు వాటిలో నుండి బయటకు వస్తే అది తెలివైన వాడి లక్షణం అని స్వామీజీ చెప్పారు. ఆశ లేని చోట శాంతి ఉంటుంది, అహంభావన లేని చోట ఆనందం ఉంటుంది. మీకు ఎంత ధనం ఉన్నా మీరు అహంభావనతో కాలిపోతూ ఉంటే మీ హృదయంలో ఆనందం ఉన్నప్పటికి ఆనందం మీకు దొరకదు. గురువు మీ స్తోత్రాలకు పొంగిపోడు, మీ విమర్శలకు కృంగిపోడు. గురువు ప్రేమ ఎటువంటిది అంటే దేనిని తొలగిస్తే మీకు వస్తువు అందుతుందో దానిని వేరుతో సహా తొలగించటానికి ప్రయత్నం చేస్తాడు, వాడే నిజమైన గురువు. గురువు మౌనంగా ఉంటే సాధకుని మనస్సు దాని అంతట అదే పరిశుద్ద మవుతుంది, పవిత్రమవుతుంది, నిర్మలమవుతుంది. బయటకు వచ్చే మాటలకంటే మౌనం చాలా విలువైనదిఅని మీరు గుర్తించాలి. బయటగురువులు మీరు చూసే దేహాలు వారు కాదు. మనలను సౌందర్యంలో ప్రవేశపెట్టటానికి, ఆత్మ దగ్గరకు తీసుకొని వెళ్ళటానికి బయట కనిపించే రూపాలు. గురువు యొక్క సన్నిధిలో ఉంటే దేహంలో ఉండి దేహంలేని స్థితిని, లోకంలో ఉండి లోకంలేని స్థితిని పొందుతావు. గురువు యొక్క మౌనం వలన, పవిత్రత యొక్క వేగం వలన నీకే కాదు, పంచ భూతాలకు, జీవకోటికి, పరిసరాలకు కూడా చల్లదనం వస్తుంది. విజయవాడలో రేడియో స్టేషన్ పని చేస్తోంది అనుకోండి. మన రేడియోలో ఆస్టేషన్ ట్యూన్ చేసుకొంటే ఆ మాటలు వినబడతాయి, ట్యూన్ చేసుకోక పోతే మాట వినబడదు. అలాగే గురువు యొక్క అనుగ్రహానికి మన మనస్సును ట్యూన్ చేసుకోవాలి. చేసుకొంటే గురువు యొక్క ప్రేమ మనకు తెలుస్తుంది. అందువలన మనస్సును ట్యూన్

చేసుకొనే బాధ్యత మనకు ఉంది.

గురువు మాట్లాడుతూ ఉంటే ఆ శబ్దం యొక్క అర్ధం నీ మనస్సుకు అందుతుంది. కాని గురువు యొక్క మౌనం నీ మనస్సుకు అందదు. ఆ మౌనం మనోమూలంలో నుండి వస్తుంది. నీవు కూడా మనోమూలంలోకి వెళ్ళినపుడే గురువు యొక్క మౌనం అర్ధమవుతుంది. గురువు యొక్క శరీరం మనకు దగ్గరగా ఉండవచ్చు కాని లోపల ఆయన ఎక్కడ ఉన్నాడో, మనం ఎక్కడ ఉన్నామో మనకు అంతు పట్టదు. మనం మనస్సు చుట్టూ తిరుగుతున్నాము. ఆయన మనోమూలంలో ఉన్నాడు. మనస్సు చుట్టూ తిరిగే నీకు మనోమూలంలో ఉన్నవాడు ఎలా అర్ధమవుతాడు. మౌనమే సమగ్రమైన, సంపూర్ణమైన ఉపదేశం. ఆయన ఉదాసీనంగా ఉంటాడు అంటే ఉన్నతమైన స్థితిలో ఆసీనమై ఉంటాడు. నీ పొగడ్తలు, విమర్శలు అంత దూరం వెళ్ళవు.

జీవితం పొడుగునా మీ మొఖంలో గాని, మీ మనస్సులో గాని అవినయం రాకుండా చూసుకోండి. అవినయం వస్తే పతనమవుతారు. పతనమయితే ఎక్కడికి వెళ్లిపోతారో తెలియదు. దుర్గంధభూయిష్ట లోకాలకు వెళ్ళిపోతారు. నీవు అవినయం పెంచుకొంటే పరమేశ్వరుడు నిన్ను దుర్గంధభూయిష్ట లోకాలలో పడవేస్తాడు. ఆ చెడ్డ వాసనను మనం భరించలేము. ఈ వాసనను భరించలేము ఇక్కడ నుండి తప్పించి మరల మానవ జన్మఇయ్యి సరిగా ప్రవర్తిస్తాము అని ఏడుస్తాము. అవినయం ఉంటే, అంత చెడ్డ వాసన వచ్చే లోకాలలో పడేస్తాడు అందువలన అజాగ్రత్త పనికిరాదు అని ఆచార్యులవారు చెప్పారు.

మీరు మౌనంగా ఉంటే ఆ మౌనం తాలుకు స్ఫూర్తిని, స్పర్శను, శక్తిని మేము పొందగలమా అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. నీవు సాధకుడవయితే పొందుతావు. నీవు భక్తుడివి కాదు అనుకో, నీలో పరిణితి లేదు అనుకో దానిని నీవు పొందలేవు. పందుల ముందు రత్నాలు పోస్తే వాటి విలువ దానికి తెలియదు వాటిని కాళ్ళ క్రింద పెట్టి తొక్కుతాయి,. నీకు అర్హత లేనప్పుడు యోగ్యత లేనప్పుడు గురువు యొక్క మౌనం నుండి వచ్చే శక్తి నీకు తెలియదు, దానిని నీవు పొందలేవు. నీవు ఎన్ని ఉపదేశములు విన్నా ఈ మాటలు చాలా బాగున్నాయి అని నీ మనస్సుకు అనిపించినా నీకు ధైర్యం లేనప్పుడు నీవు వాటిని ప్రాక్టీసు చేయలేవు మనకు మబ్బు పడితే భయం, పిల్లిని చూస్తే భయం ఇంక మనం ఏమి ప్రాక్టీసు చేస్తాము. ఆచరించటానికి ఎంతో కొంత ధైర్యం ఉండాలి. సత్యం నీ మనస్సుకు, నీ మాటకు, నీ సంకల్పాలకు అతీతం. నీ మనస్సుకు, మాటకు అది అందదు. మనస్సు మాట అణిగినచోట సత్యం నీకు తెలియబడుతుంది. అది నీవు బుద్ధితో తెలుసుకొనే వస్తువు కాదు. నీ తెలివిని చూసి, నీలోని మంచి గుణాలను చూసి, నీ ప్రవర్తనను చూసి అది ఎప్పుడోనీకు ఎరుక పడుతుంది అంతేగాని అది నీ మనస్సుతో గ్రహించేది కాదు. ఏదైతే సత్యమో అది ఎప్పుడు సహజంగానే ఉంటుంది. ఏదైతే సహజంగా ఉంటుందో అది ఎప్పుడూ సత్యంగా ఉంటుంది.

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL ☎ 24776